## అనగనగా... ఒక కథ

# కోడి బతుకు

**తిరుపతి తల్లికి అంతంత మాత్రమే ఆరోగ్యం.**

**ముక్కుతూ, మలుగుతూ, ఆగుతూ, పనిచక్కబెట్టు కుంటూ ఉంది. కాస్త పని చేసేప్పటికి అలసటా ఆయాసం.**

'కాడు రమ్మంటుంది ఊరుపొమ్మం టుంది' అన్నట్లుంది. వంట్లో శక్తి ఉన్నప్పుడు వీళ్లింట్లో వాళ్లింట్లో బియ్యం బాగుచేయటం.

అంట్లపనీ పాచిపనీ చేసి వాళ్లిచ్చే నూకలూ, పచ్చళ్లు తెచ్చుకుని కాలక్షేపం చేసేది. భర్త పోయాక ఆ బెంగతో వయస్సూ తోసుకొచ్చింది.

ఓపిక పోయాక ఆవిణ్ని ఎవరూ పిల్చేవారు కాదు పాపం ఇంక పని చేయలేదని.

మిగిలిన కూరలూ, పచ్చళ్లూ ఉంటే 'ఓ అడుగిటొచ్చి ఇవి పట్టికెళ్లవే నరసమ్మా!' అని పక్క పెరట్లోంచి కనకంగారమ్మాయో మేష్టారి కోడలో పిలిచేవారు. ఓపిక లేచొచ్చి తెచ్చుకుని గిన్నెలు కడిగి బోర్లించొచ్చేది.

ఇంత కష్టపడుతూన్న ఆ ముసిలిదాన్ని చూసి.. పట్టించుకోకుండా చిన్న పిల్లాడిలా సతా యించేస్తాడు కొడుకు తిరుపతిగాడు.

ఆవిడకి వాడు ఒక్కడే. తల్లి అన్న ప్రేమా లేదు. ''పాపం ముసల్దిలే'' అని జాలీ లేదు.

వాడేం పని వెలగబెడతాడో తెలియదుగానీ పొద్దున్నే వెళ్లిపోతాడు. రాత్రి చీకటి పడ్డాక వస్తాడు.

తల్లితో మాట్లాడేది కేవలం తిండి విషయమే.

ఆ రోజు తిరుపతి చాలా బీభత్సం ప్రారంభిం చాడు. వెళ్లేప్పుడు నర్సమ్మకి కోడికూరొండమని ఆర్డర్ చేసి వెళ్లాడు. తల్లి ఓపిక తెల్సున్నదే అయినా తిరుపతి కోరిక ముందు జరిగి తీరాలి. వీధంతా వినిపించేంత రాద్ధాంతం మొదలెట్టాడు.

''కొడుకుకి కావల్సినది వొండి బెట్టలేనమ్మ ఉంటేనే, సస్తేనే... సీ ఎదవజనమ!!'' అన్నాడు. చివుక్కుమంది నర్సమ్మ ప్రాణం.

''ఒరే నాది వండిపెట్టే వయసు కాదురో. కూకోపెట్టి తినబెట్టాల్రా. నువ్ ఏం చేశావో పెళ్లాం పుట్టింటికెళ్లి కూకుంది. కోడలు సుఖపె డుతుందన్నా ఆ 'ఇది' కూడా లేకుండా చేశావు. కానుపై ఆర్నెల్లయినా ఇంకా ఇంటికి పెళ్లాణ్ని పిల్లాణ్నైనా తెచ్చుకోలేదు. నీకు ప్రేమల్లేవురా...''

''నీలాగే ఆళ్లూ...నా నెత్తిమీద కూచోలేదు గనక బతికిపోయింది. నీతోనే బతకలేక సస్తు న్నాను''

''తప్పొరే... నువ్ సావడమేంటి కుర్ర ఎధవ్వి- ముసలి ముండని. నేను సావాల. మీదింకా ముందుకాలం ఉండేకాలం.''

''నువ్వుంటావే - నే సచ్చేదాక పోవు!!''

''రామ..రామ'' అంది నరసమ్మ.

★ ★ ★

'రామ...రామ' అనుకుంది ఎక్కిరిపించి నట్లు బుట్టలో ఉన్న కోడి.!!

గుడ్డులో ఉన్నప్పణ్నించీ - పసిగుడ్డులా బైటకి తిరుగుతోణప్పణ్నుంచీ అది అమ్మానా న్నల్ని అంటిపెట్టుకుని తిరుగుతుండేది.

అమ్మ ఒక్క క్షణం కనిపించకపోతే విలవిల్లాడి పోయేది.

అప్పుడో రోజు అమ్మని చూసినప్పుడు, ఇంకోసారి నాన్నని చూసినప్పుడూ ఇలాగే వాడి నోరూరింది. వాళ్ల బతుకులు పొయ్యెక్కాయి. ఇవ్వాళ తన వంతు వచ్చింది. ఇది సహజం అను కుంది. అప్పుడు పడినంత దుఃఖం ఇప్పుడు పడ ట్లేదు. తోడపుట్టి పెరిగిన వాళ్లందరూ ఒక్కొక్క ళ్లుగా అయిపోయారు. తన పిల్లలూ రెక్కలొచ్చి పెరిగి పెద్దాళ్లయి - ఒక్క వేటుతోనూ, ఒక్క పూటతోనూ మట్టిలో కల్సిపోతాయి అను కుంది.

మహా అయితే (ఎవ్వరూ నరకకపోతే) ఆర్నెల్లో మరో నెల్లాళ్లో మా జీవితం- మను షుల్లా అరవై - డెబ్భై - తొంభై ఇంకా బతికి నరసమ్మలా..కన్నవాళ్లతోనూ, వాళ్లు కట్టు కున్న వాళ్లతోనూ.. వాళ్లు కన్నవాళ్లతోనూ కష్టాలు పడుతూ.. కన్నీళ్లు తుడుచుకుని లేస్తూ చావు కోసం తపస్సు చేస్తూ చస్తూ బతకక్కర్లేదు- అనుకుంది కోడి.

★ ★ ★

తిరుపతీ నరసమ్మల తగాదా ఇంకా నడు స్తోంది.

తిరుపతి అరుస్తున్నాడు. నరసమ్మ ఏడు స్తోంది.

''ఓపిక పోయిన మనుషుల్ని తీసుకెళ్లిపో వాల్రా ఆ దేవుడు. కానీ నువ్... ఆ పాపం చెయ్యకు. కొడుకు చేత కొడవలి ఎత్తించు కుంటే.. కాదురా... కొరివి పెట్టించుకుంటే పుణ్నెం - నీకూ నాకూను.''

''సీ నీయవ్వ'' కోపంగా కొడవలి విసిరేశాడు తిరుపతి.

వాడి చేతిలో చస్తానని భయంగా కూలబడిన నరసమ్మ కూడదీసుకుని పైకి లేచింది. 'ఆడు తన్ని సంపేస్తే నలుగురూ పోగై వాణ్ని పట్టుకుని జైల్లోకి నెట్టేస్తారు'' అని కన్నతల్లి భయం.

''రెడ్డెమ్మగారింట్లో పులుసడిగి తెస్తాను. సింతకాయ పచ్చడి ఉంది ఈ పూటకి వేసుకు తిను! రేపు కూరొండుతాను'' ఏడుస్తూ బతి మాలింది.

ఇంతలో పెళ్లాం పిల్లాడితో ఎల్లుండి వస్తూ న్నట్లు..పక్క ఊర్నుంచి చింతాలుగాడు కబురు తెచ్చాడు.

"ఓపిక పోయిన మనుషుల్ని తీసుకెళ్లిపోవాల్రా ఆ దేవుడు. కానీ నువ్... ఆ పాపం చెయ్యకు. కొడుకు చేత కొడవలి ఎత్తించుకుంటే.. కాదురా... కొరివి పెట్టించుకుంటే పుణ్నెం - నీకూ నాకూను."

తిరుపతి ముఖంలో వెయ్యి కాగడాలు వెలగలేదు గానీ 'అమ్మయ్య' అనుకున్నాడు.

''ఓ ముసిల్దానా... ఏ మాటకామాటే చెప్పుకోవాలి నీ కోడలు నీకన్నా కూర బాగా వొండుద్ది''

తల్లిముఖంలో మాత్రం వెయ్యి కాగడాలు వెలిగాయి.

''బంగారం లాంటి మాటన్నావు నాయనా'' మురిసిపోయింది ముసలమ్మ.

★ ★ ★

కోడి 'కొక్కొరోక్కో'మని నవ్వుకుంది.

ఈ ముసలమ్మ ఎప్పుడూ ఇంతే.. ముసలమ్మలందరూ అంతే!!!

★ ★ ★

మూడో నాడు సాయంత్రం కోడలు కొడుకుతో వచ్చింది.

గూడెం అంతా గుమిగూడారు! అందరూ తలోసారి మనవడి నెత్తుకుని మురిసిపోతుంటే ముసలమ్మ మహారాణిలా మెరిసిపోయింది. లేని ఓపికొచ్చింది.

పిల్లాణ్ని ఎత్తుకుని ముద్దులాడేందుకు పుట్టగానే చూడ్డానికి వెళ్లింది. అప్పుడు దబ్బపండులా ఉన్నాడనుకుంది. ఇప్పుడు గుమ్మడిపండులా తయారయ్యాడు. కాగుపొయ్యి రాజేసి వేన్నీళ్లు పెట్టి..తంఢ్రికొక్కాసిన్నీళ్లు ఉంచి, పిల్లాడికి పోసింది. బొట్టెట్టి మరో జుబ్బా తొడిగింది. ''దొరలాంటి నా మనవడికి మరీ ఇట్టాటి సొక్కా ఏంటి?'' అంది వాణ్ని ముద్దాడుతూ-

''వాళ్లమ్మమ్మ కాడయ్యే ఉన్నాయి. ఆళ్ల నాన్నమ్మ కొంటది దొరబాబు సొక్కా'' చురుక్కున కోడలి జవాబు-

చివుక్కుమంది ముసలావిడ ప్రాణం.

ఒక్క మాటకి చాలా జవాబులు చెప్పింది కోడలు.

ఇందాకా గుమిగూడిన ఆడంగులంతా



కోడలు నోటి మాటలు చిత్రంగా వింటున్నారు.

అర నిముషంలో గుడ్డ వుయ్యాలా కట్టి పిల్లాణ్ని నర్సమ్మ చేతిలోంచి లాక్కెళ్లింది- అంత సేపూ విస్తుపోయి చూస్తోంది నరసమ్మ.

★ ★ ★

కోడి విస్తుపోలేదు. గిలగిలా కొట్టుకుంది. గడబిడగా అరిచింది. అది కోడల్ని తిట్టటం కాదు. అత్తని కోప్పడ్డం కాదు. మనుషులంతా ఇంతే.. అనుకుంటూ అరచింది.

''ఇప్పుణ్ణీకేమైందే పిచ్చి మొహమా'' అనుకుంటూ నరసమ్మ వచ్చి కోడిని గుట్టలోంచి తీస్తుంటే-

''ఎదవగోల కోడిగోల! ఇంక పిల్లాడు పడుక్కున్నట్లే'' కోడలు అన్న మాటలు వినిపించాయి. కోడిని చూసి ముసలమ్మకి జాలేసింది. అయినా కోడి గొంతు నొక్కేసింది.

★ ★ ★

మర్నాడు కోడి పొయ్యెక్కేసింది. కానీ నరసమ్మ తినలేదు. కాదు....వాళ్ల కోడలూ కొడుకూ పెట్టలేదు. అంతేకాదు మనవణ్ని మళ్లీ ఒళ్లో కూచోపెట్టుకోనీయలేదు.

*